సాక్షి
నంద్యాల
బుధవారం । 4 । అక్టోబర్ । 2023



నిప్పులవాగుకు నీరు విడుదల

జూపాడుబంగ్లా: సుంకేసుల డ్యాం నుంచి కర్నూలు-కడప కాల్వకు విడుదలవుతున్న నీటిలో 1,400 క్యూసెకుల్లో లాకిన్స్‌లా నుంచి నిప్పులవాగుకు మళ్లించారు.



శ్రీశైలంలో శాస్త్రోక్తంగా పూజలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల ఆలయ ప్రాంగణం లోని శనగల బసవన్నకు, శ్రీబయలు వీరభద్ర స్వామికి మంగళవారం శాస్త్రోక్తంగా అర్చకులు విశేష పూజలు నిర్వహించారు.



వన్య ప్రాణులపై అవగాహన

రుద్రవరం: వన్య ప్రాణుల సంరక్షణ మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం హరినగరంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఫారెస్టు సెక్షన్ అధికారి శ్రీనివాసరెడ్డి, సిబ్బంది రాణెమ్మ పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

పోతిరెడ్డిపాడు నుంచి కొనసాగుతున్న నీటి విడుదల



జూపాడుబంగ్లా: పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ ద్వారా ఎస్సార్బీసీకి 1,000 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నట్లు ఏఈ విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ శ్రీశైలం జలాశయంలో సాయంత్రానికి 856.00 అడుగుల నీటిమట్టం ఉండగా పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ వద్ద 855.00 అడుగుల నీటిమట్టం ఉన్నట్లు తెలిపారు. పోతిరెడ్డిపాడు నుంచి విడుదలవుతున్న నీటిని బానకచర్ల నీటినియంత్రణ వ్యవస్థ నుంచి తెలుగుగంగ కాల్వకు మళ్లించినట్లు ఏఈ దేవేంద్ర తెలిపారు. వెలుగోడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ పూర్తిసామర్థ్యం 16.5 టీఎంసీలు కాగా ప్రస్తుతం 8.8 టీఎంసీలు ఉన్నట్లు తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జీఎన్ఎస్ఎస్ (ఎస్సార్బీసీ)కాల్వకు, కేసీ ఎస్కేప్ కాల్వకు నీటిసరఫరాను బంద్ చేసినట్లు తెలిపారు.

నేడు 'దిశా' సమావేశం

నంద్యాల: నంద్యాల పార్లమెంట్ సభ్యులు పోచా బ్రహ్మానంద రెడ్డి అధ్యక్షతన ఈనెల 4వ తేదీ బుధవారం సాయంత్రం 4 గంటలకు జిల్లా అభివృద్ధి సమన్వయ పర్యవేక్షణ (దిశా) సమావేశం నిర్వహిస్తామని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టరేట్ లోని వైఎస్సార్ సెంటినరీ హాలులో జరిగే ఈ సమావేశానికి జిల్లాలోని శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులు, దిశా కమిటీ సభ్యులు, మండల పరిషత్ అధ్యక్షులు హాజరు కావాలని కలెక్టర్ కోరారు.

సంసద్ ఆదర్శ గ్రామ యోజన సమావేశం..

కలెక్టరేట్‌లోని వైఎస్సార్ సెంటినరీ హాలులో బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు సంసద్ ఆదర్శ్ గ్రామ యోజన సమావేశం నిర్వహిస్తామని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి జిల్లాలోని నంద్యాల, జూపాడుబంగ్లా, ఉయ్యాలవాడ, కోవెలకుంట్ల మండలాలకు సంబంధించిన మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, చార్జ్ ఆఫీసర్లు, పంచాయతీ సెక్రటరీలు పాల్గొనాలన్నారు. సంసద్ ఆదర్శ్ గ్రామ యోజన పథకం కింద కేంద్ర ప్రభుత్వం చేపట్టిన అభివద్ధి కార్యక్రమాలపై సమీక్ష జరుగుతుందన్నారు.

వివరాల నమోదుకు 30 వరకు గడువు

నంద్యాల(న్యూటౌన్): ఈ ఏడాది జరిగిన నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్షలో ఎంపికైన విద్యార్థులు నేషనల్ స్కాలర్‌షిప్ పోర్టల్‌లో తమ వివరాలు నవంబర్ 30వ తేదీ లోపు నమోదు చేసుకోవాలని డీఈఓ సుధాకర్ రెడ్డి మంగళవారం తెలిపారు. మెరిట్ కార్డుపై ముద్రించిన వివరాలను నమోదు చేసుకోవాలన్నారు. నవంబర్ 2019, ఫిబ్రవరి 2021, మార్చి 2022 సంవత్సరంలో ఎంపికైన ప్రభుత్వ ఎయిడెడ్ పాఠశాలలు, కళాశాలలు, చదువుతున్న విద్యార్థులు ఈ సంవత్సరం తప్పకుండా రెన్యువల్ చేసుకోవాలని తెలిపారు. అలాగే డిసెంబర్ 30వ తేదీలోగా నోడల్ ఆఫీసర్ లాగిన్ ద్వారా దరఖాస్తు చేసుకొని ధ్రువీకరించాలన్నారు. ఈ తేదీల్లో ఎటువంటి పొడిగింపు ఉండదన్నారు.

ముమ్మరంగా వైఎస్ఆర్ పెన్షన్ కానుక పంపిణీ

కర్నూలు(అగ్రికల్చర్): వైఎస్ఆర్ పెన్షన్ కానుక కింద అక్టోబర్ నెల పింఛన్ల పంపిణీ కార్యక్రమం ఉమ్మడి జిల్లాలో ముమ్మరంగా జరుగుతోంది. ఈ నెల 1, 2వ తేదీలు సెలవు దినాలైనప్పటికీ గ్రామ, వార్డు వలంటీర్లు పంపిణీ చేపట్టారు. మంగళవారం సాయంత్రం 6 గంటల సమయానికి కర్నూలు జిల్లాలో 2,47,021 పింఛన్లు ఉండగా 2,36,691 మందికి(95.82 శాతం).. నంద్యాల జిల్లాలో 2,33,210 పింఛన్లు ఉండగా 2,15,266 మందికి(96.44 శాతం) నగదు అందించారు.

శనగ విత్తనాలకు రిజిస్ట్రేషన్లు

కర్నూలు(అగ్రికల్చర్): రబీ సీజన్‌లో శనగ సాగు కోసం విత్తనాలకు డిమాండ్ ఏర్పడింది. రైతుభరోసా కేంద్రాల్లో శనగ విత్తనాల కోసం రైతులు ముమ్మరంగా రిజిస్ట్రేషన్‌లు చేసుకుంటున్నారు. కర్నూలు జిల్లాలో 15,593 మంది రైతులు 21,299 క్వింటాళ్ల శనగ విత్తనాల కోసం డీ-క్రిషి యాప్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. నంద్యాల జిల్లాలో 3,537 రైతులు 4,781 క్వింటాళ్ల విత్తనాల కోసం రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ఏపీ సీడ్స్ ఇప్పటి వరకు కర్నూలు జిల్లాలో 13,500 క్వింటాళ్లు, నంద్యాల జిల్లాలో 3,460 క్వింటాళ్లు కేటాయించింది. కర్నూలు జిల్లాకు 67,094, నంద్యాల జిల్లాకు 28,747 క్వింటాళ్లు కేటాయించింది



సబ్సిడీలు కలిసొచ్చి.. ఉద్యానం వికసించి!

ఉద్యాన పంటలపైనే రైతుల దృష్టి
- 2022-23లో 2,36,257 ఎకరాల్లో సాగు
- 2023-24 ఖరీఫ్‌లోనే 2,01,641 ఎకరాల్లో పంటలు
- ఈ ఏడాది 25 శాతం పెరగనున్న ఉత్పాదకత
- ఎంఐడీహెచ్, ఏపీఐఐఏటీపీ, ఆర్‌కేవీవైై పథకాల వర్తింపు
- సబ్సిడీల కింద ఈ ఏడాది రూ.7.62 కోట్లు

కర్నూలు(అగ్రికల్చర్): ఉద్యాన పంటల సాగు క్రమంగా పెరుగుతోంది. వ్యవసాయ పంటలైన పత్తి, వేరుశనగ, మొక్కజొన్న తదితర పంటలు కలసిరాకపోతుండటంతో రైతులు ఉద్యాన పంటల సాగులో రాణిస్తున్నారు. ఉద్యాన సమగ్ర అభివృద్ధి మిషన్(ఎంఐడీహెచ్), ఏపీఐఐఏటీపీ, రాష్ట్రీయ కృషి వికాస్ యోజన(ఆర్‌కేవీవై) కింద ఉద్యాన పంటల సాగును ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. ఈ నేపథ్యంలో పండ్లతోటలు, కూరగాయలు, సుగంధ ద్రవ్యాల పంటలు, ఔషధ మొక్కలు, పూల తోటల అభివృద్ధి జోరుగా సాగుతోంది. 2022-23లో 2,36,257 ఎకరాల్లో ఉద్యాన పంటలు సాగయ్యాయి. ఉద్యాన పంటలను దాదాపు నీటి సదుపాయం కింద సాగు చేస్తారు. అందువల్ల రైతులు నష్టపోవడం అంటూ ఉండదు. ఈ సారి ఉద్యాన పంటల అభివృద్ధికి ప్రభుత్వం రూ.7.62 కోట్ల సబ్సిడీలు ఇస్తోంది. సూక్ష్మ సేద్యం అభివృద్ధికి ఇస్తున్న సబ్సిడీలు ఇందుకు అదనం. ఉద్యాన పంటల అభివృద్ధికి సబ్సిడీలు ఇచ్చేందుకు ఎంఐడీహెచ్ కింద రూ.6.72 కోట్లు, ఏపీఐఐఏటీపీ కింద రూ.58.78 లక్షలు, ఆర్‌కేవీవై కింద రూ.1.02 కోట్లు మంజూరు చేసింది. చెరువుల కింద వరికి ప్రత్యామ్నాయంగా ఉద్యాన పంటలు సాగు చేస్తే 75 శాతం సబ్సిడీలు ఇస్తుండటం విశేషం.

ప్రోత్సాహకాలు ఇలా..

➤ ఉద్యాన పంటల అభివృద్ధికి ప్రభుత్వం వివిధ రూపాల్లో సబ్సిడీలు ఇస్తోంది.
➤ ఎంఐడీహెచ్, ఆర్‌కేవీవై, ఏపీఐఐఏటీపీ కింద ఇస్తున్న ప్రోత్సాహకాలే ప్రధాన కారణం.
➤ ఉద్యాన పంటల సాగులో పెట్టుబడి వ్యయం ఎక్కువగా ఉంటుంది.
➤ వివిధ పంటలకు మల్చింగ్ సదుపాయం కల్పిస్తారు.
➤ ప్రభుత్వం సూక్ష్మ సేద్య సదుపాయం కూడా కల్పిస్తోంది.
➤ రైతులకు సబ్సిడీపై కూరగాయల విత్తనాలను సరఫరా చేస్తోంది.
➤ పండించిన పంటలను సేకరించి, గ్రేడింగ్ చేసుకొని వాటిని మార్కెటింగ్ చేసుకునేందుకు వీలుగా కలెక్షన్ సెంటర్లు, వెండింగ్ వ్యాన్‌లు, కోల్డ్ రూములు మంజూరు చేస్తోంది.





ఇప్పటికే 2,01,641 ఎకరాల్లో ఉద్యాన పంటలు

వర్షాధారం కింద సాగు చేస్తున్న ఉద్యాన పంటలు నిరాశకు గురి చేస్తున్నాయి. 2022-23తో పోలిస్తే పత్తి, వేరుశనగ, మొక్కజొన్న తదితర పంటల సాగు తగ్గింది. ఇందులో అనేక మంది రైతులు ఉద్యాన పంటల వైపు మళ్లినట్లు స్పష్టమవుతోంది. ఈ ఏడాది ఖరీఫ్‌లో ఉద్యాన పంటల సాధారణ సాగు 1,93,274 ఎకరాలు ఉండగా.. ఈ-క్రాప్‌లో నమోదైన వివరాల ప్రకారం ఇప్పటికే 2,01,641 ఎకరాల్లో సాగు కావడం విశేషం. ఇంకా ఈ-క్రాప్‌లో నమోదు చేయాల్సిన ఉద్యాన పంటలు ఉన్నాయి. కూరగాయల పంటలు ఇప్పటికే దాదాపు 55,989 ఎకరాల్లో సాగయ్యాయి. సుగంధ ద్రవ్యాల పంటల సాగు 1,35,411 ఎకరాల్లో ఉండటం విశేషం. 2022-23 ఖరీఫ్ సీజన్‌తో పోలిస్తే 2023-24లో ఉద్యాన పంటల సాగు 20 శాతం వరకు పెరుగుతోంది.

శ్రమతో పాటు ఆదాయం



నాకు ఐదెకరాల భూమి ఉంది. రెండు ఎకరాల్లో ఉల్లి, ఒకటిన్నర ఎకరాలో చిక్కుడు, మిగతా భూమిలో మల్లెసాగు చేస్తున్నా. కొన్నేళ్లుగా ఉద్యాన పంటలు సాగు చేస్తుండటంతో ఇంతవరకు నష్టాలు వచ్చిన దాఖలాలు లేవు. ఉద్యాన పంటల సాగులో కొంత శ్రమ ఉంటుంది. ఇందుకు తగినట్లు ఆదాయం కూడా వస్తుంది. ఈ సారి ఉల్లికి ధర ఆశాజనకంగా ఉంది. చిక్కుడుకు మార్కెట్‌లో డిమాండ్ ఎక్కువ. మల్లెసాగుకు ఏం దిగుల్లేదు.

– అబ్దుల్ సుకూర్, దొడ్డిపాడు గ్రామం, కల్లూరు మండలం

జిల్లాలో ప్రస్తుతం ఉద్యాన పంటల సాగు ఇలా..

పంట	సాగు విస్తీర్ణం (ఎకరాల్లో)
కూరగాయల పంటలు	55,989
పండ్లతోటలు	9381
సుగంధ ద్రవ్యాలు	1,35,411
పూలు	710
ప్లాంటేషన్ క్రాప్స్	52
ఔషధ మొక్కల సాగు	98
మొత్తం	2,01,641

ఉత్పాదకత భారీగా పెరిగే అవకాశం

2023-24 ఖరీఫ్‌లో ఉద్యాన పంటల ఉత్పాదకత భారీగా పెరిగే అవకాశం ఏర్పడింది. 2022-23లో ఏడాది పొడవున ఉద్యాన పంటల సాగు 2.36 లక్షల ఎకరాలు ఉండగా ఉత్పాదకత 11,36,950 టన్నులు వచ్చింది. ఈ సారి ఒక్క సీజన్‌లోనే దాదాపు 2,01,641 ఉద్యాన పంటలు సాగయ్యాయి. గత ఏడాదితో పోలిస్తే 25 శాతం వరకు ఉత్పాదకత పెరిగే అవకాశం ఉంది. ఉద్యాన శాఖ కూడా 2023-24లో ఉత్పాదకతను దాదాపు 15 లక్షల టన్నులకు పెంచాలనే లక్ష్యంతో ఉన్నట్లు తెలుస్తోంది.

“ ఉద్యాన పంటలకు ప్రాధాన్యం



ఉద్యాన పంటల అభివృద్ధికి ప్రభుత్వం ప్రధానంగా మూడు స్కీంలను అమలు చేస్తోంది. ఎంఐడీహెచ్, ఏపీఐఐఏటీపీ, ఆర్‌కేవీవై కింద 2023-24లో రూ.7.62 కోట్ల విలువ సబ్సిడీలు ఇస్తోంది. ఏపీఎంఐపీ ద్వారా సన్న, చిన్నకారు రైతులకు 90 శాతం సబ్సిడీపై సూక్ష్మ సేద్య సదుపాయం కల్పిస్తున్నారు. కరువు నుంచి బయట పడేందుకు ప్రభుత్వం ఉద్యాన పంటల సాగును ప్రోత్సహిస్తోంది. ఆదోని ఏరియా డెవలప్‌మెంటు అథారిటీ కింద పశ్చిమ ప్రాంతంలో ఉద్యాన పంటల అభివృద్ధి ప్రాధాన్యత ఇస్తున్నాం.

– పి.రామాంజనేయులు, జిల్లా ఉద్యాన అధికారి, కర్నూలు

భక్తులను దోచుకునే లాడ్జీలపై చర్యలు

- అధిక ధరలు వసూలు చేయడం సబబు కాదు
- గదుల అద్దె ధరల బోర్డులు ఏర్పాటు చేయాలి
- 'సాక్షి' కథనానికి స్పందించిన జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డి



మహానంది స్టేషన్‌లో రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ రఘువీర్‌రెడ్డి

మహానంది: మహానంది క్షేత్ర పరిధిలోని లాడ్జీల యజమానులు రద్దీ పేరుతో భక్తులను దోచుకుంటే చర్యలు తప్పవని ఎస్పీ రఘువీర్‌రెడ్డి హెచ్చరించారు. రద్దీ నేపథ్యంలో ఆదివారం ఐదింతలు వసూలు చేయడంతో భక్తులు ఇబ్బందులు పడిన తీరుపై సోమవారం 'సాక్షి' దినపత్రికలో వచ్చిన కథనానికి ఎస్పీ స్పందించి చర్యలకు ఆదేశించారు. మంగళవారం ఆయన మహానంది పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. అనంతరం సీఐ రవీంద్ర, ఎస్ఐ నాగేంద్రప్రసాద్‌తో కలిసి పట్టుబడిన వాహనాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆ తర్వాత ఎస్పీ రఘువీర్‌రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ.. అనుమతి లేకుండా నిర్వహిస్తున్న లాడ్జీలను మూసివేస్తామన్నారు. క్షేత్ర పరిధిలో లాడ్జీల వివరాలను రెండు రోజుల్లో సేకరించాలని సీఐ, ఎస్ఐని ఆదేశించారు. రద్దీ లేని రోజు ఓ రకంగా, రద్దీ ఉందని మరో రకంగా అధికంగా వసూలు చేయడం ఏ మాత్రం మంచి పద్ధతి కాదన్నారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు ఇబ్బందులు పడకూడదన్నారు. ప్రతి లాడ్జీ వద్ద ధరల బోర్డు ఏర్పాటు చేసి, భక్తులు ఎవరైనా సమస్యపై ఫిర్యాదు చేసేలా ఎస్ఐ, ఎస్పీ ఫోన్ నంబర్లను అందుబాటులో ఉంచాలన్నారు. దారిదోపిడీ జరిగిన ఘటనపై రెండ్రోజుల్లో పూర్తి వివరాలు వెల్లడిస్తామన్నారు. ఈ మార్గంలో ప్రతిరోజూ పెట్రోలింగ్ తప్పనిసరిగా నిర్వహించాలన్నారు. భక్తులకు ప్రశాంత వాతావరణం కల్పించేందుకు అన్ని చర్యలు తీసుకోవాలన్నారు.

సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లే మోసపోతే ఎలా..

సైబర్ నేరాలపై నిత్యం అవగాహన కల్పిస్తున్నామని అయినా సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లే సైబర్‌నేరగాళ్ల చేతిలో మోసపోతే ఎలా? అంటూ ఎస్పీ రఘువీర్‌రెడ్డి ప్రశ్నించారు. వారి కంటే గ్రామీణ ప్రజల్లో మంచి అవగాహన ఉందన్నారు. డోన్, బండిఆత్మకూరు మండలాల పరిధిలో ఇద్దరు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు రూ. 31లక్షల వరకు మోసపోయారని చెప్పారు. సైబర్ నేరాలపై పదేపదే హెచ్చరిస్తూ అవగాహన కల్పిస్తూనే ఉన్నామని, అయినా అత్యాశతో బోల్తా పడుతున్నారన్నారు.



అవ్వా చూపు బాగా కనిపిస్తుందా.. కొలిమిగుండ్ల మండలం తుమ్మలపెంట గ్రామంలో మంగళవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో వృద్ధురాలికి కళ్లజోడు పెడుతున్న జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి – కొలిమిగుండ్ల

10న జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు

కర్నూలు(అర్బన్): జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి ఉత్తర్వుల మేరకు ఈ నెల 10న జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలను జెడ్పీ మినీ సమావేశ భవనంలో నిర్వహిస్తున్నట్లు సీఈఓ జి.నాసరరెడ్డి తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3.30 గంటల వరకు ఏడు స్థాయీ సంఘాల సమావేశాలను నిర్వహిస్తామన్నారు. గ్రామీణాభివృద్ధి, వ్యవసాయం, సాంఘిక సంక్షేమం, విద్య వైద్యం, మహిళాభివృద్ధి శిశు సంక్షేమం, ఆర్థిక, ప్రణాళిక పనులపై సమీక్ష ఉంటుందన్నారు.

సామర్థ్యాల పెంపు.. పరీక్షలతో మదింపు

ఫార్మెటివ్ ఏ-2 పరీక్షలు ప్రారంభం
- పాత విధానంలోనే నిర్వహణ
- జిల్లాలో 1962 పాఠశాలల్లో 3,02,740 మంది విద్యార్థులు
- 10వ తేదీలోగా మూల్యాంకనం
- వెబ్ పోర్టల్లో మార్కుల నమోదు
- ఈనెల 14 నుంచి 24వ తేదీ వరకు దసరా సెలవులు




మద్దూరులో ఎఫ్ఏ-2 పరీక్షలు రాస్తున్న విద్యార్థినులు

నంద్యాల(న్యూటౌన్): విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాలను మదింపు చేసేందుకు విద్యాశాఖ ఫార్మెటివ్ అసెస్‌మెంట్ (ఎఫ్ఏ - 2 పరీక్షలు మంగళవారం నుంచి ప్రారంభమయ్యాయి. ఈ నెల 6వ తేదీ వరకు ప్రభుత్వ, ప్రైవేట్ యాజమాన్యాల పరిధిలో ఉన్న అన్ని పాఠశాలల విద్యార్థులు రాస్తున్నారు. ఇందుకు జిల్లా విద్యా శాఖ అధికారులు, డీసీఈబీ అధికారులు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. జిల్లాలో మొత్తం 1,962 పాఠశాలల్లో 3,02,740 మంది విద్యార్థులు చదువుతుండగా, 850 ప్రైవేటు యాజమాన్యాల పాఠశాలలో 1,30,520 మంది చదువుతున్నారు. వీరంతా ఫార్మెటివ్ ఏ-2 పరీక్షలు రాస్తున్నారు. 1వ తరగతి నుంచి 10వ తరగతి విద్యార్థులకు రాష్ట్ర విద్యా పరిశోధన మండలి (ఎస్‌సీఈఆర్‌టీ) రూపొందించిన ఉమ్మడి ప్రశ్నపత్రం ద్వారానే పరీక్షలు నిర్వహించేందుకు అధికారులు సన్నద్ధమవుతున్నారు. ఇందుకు సంబంధించిన షెడ్యూల్‌ను విడుదల చేశారు. ఇటీవల నిర్వహించిన ఫార్మెటివ్-1 పరీక్షను క్లాస్ రూం బేస్డ్ విధానం సీబీఏలో ఓఎంఆర్ ద్వారా నిర్వహించగా ఫార్మెటివ్ -2 పరీక్షలు మాత్రం పాత విధానంలో నిర్వహించనున్నారు. ప్రశ్నపత్రాన్ని బ్లాక్ బోర్డుపై ఉపాధ్యాయులు రాయగా, విద్యార్థులు నమోదు చేసుకుని, సమాధానాలు రాస్తున్నారు. ఎఫ్ఏ-2 పరీక్షకు ప్రింటెడ్ పేపర్లను సరఫరా చేయడం లేదు. అన్ని మేనేజ్‌మెంట్ల ప్రధానోపాధ్యాయులకు పరీక్ష పేపర్లను మెయిల్/వాట్సాప్ గ్రూపులో పంపిస్తారు. ఆ పేపర్లను సంబంధిత ప్రధానోపాధ్యాయులు డౌన్‌లోడ్ చేసుకుని, పరీక్షలను నిర్వహించాల్సి ఉంటుంది. ఈ నెల 10వ తేదీలోగా ఆన్‌లైన్‌లో మార్కులను నమోదు చేయాల్సి ఉంటుంది. ఆ తర్వాత వారి తల్లిదండ్రులతో సమావేశాలను నిర్వహించి విద్యార్థుల ప్రతిభను తెలిపేలా పాఠశాల విద్యా శాఖ చర్యలు తీసుకుంటుంది.

పరీక్షల షెడ్యూల్ ఇలా..

- 1 నుంచి 5వ తరగతి వరకు విద్యార్థులకు అక్టోబర్ 3, 4 తేదీల్లో ఉదయం, మధ్యాహ్నం రెండు విడతలుగా నిర్వహిస్తారు. వీరికి 3వ తేదీన తెలుగు, గణితం, 4న ఈవీఎస్, ఇంగ్లిష్ పరీక్షలు నిర్వహిస్తారు. 5వ తేదీన 3, 4, 5 తరగతుల విద్యార్థులకు ఓఎస్ఎస్సీ పరీక్ష ఉదయం నిర్వహిస్తారు.
- 6, 7, 8 తరగతుల విద్యార్థులకు 3వ తేదీన తెలుగు, గణితం, 4న హిందీ, జనరల్ సైన్స్, 5న సోషల్, ఇంగ్లిష్, 6న ఓఎస్ఎస్సీ-1, ఓఎస్ఎస్సీ-2 పరీక్షలు నిర్వహిస్తారు.
- 9, 10 తరగతులకు 3న తెలుగు, గణితం, 4వ తేదీన హిందీ, జనరల్ సైన్స్, 5వ తేదీన సోషల్, ఇంగ్లిష్, 6వ తేదీన ఓఎస్ ఎస్సీ-1, ఓఎస్ఎస్సీ-2 పరీక్షలు నిర్వహిస్తారు.
- 14 నుంచి 24వ తేదీ వరకు పాఠశాలలకు దసరా సెలవులు.

ప్రశ్నాపత్రాన్ని డౌన్‌లోడ్ చేసుకోవాలి



ఫార్మెటివ్-2 పరీక్షలకు డీఈఓ నేతృత్వంలో అన్ని చర్యలు తీసుకున్నాం. ప్రశ్నపత్రాలను సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఈ-మెయిల్/వాట్సాప్ నుంచి డౌన్‌లోడ్ చేసుకుని పరీక్షలు నిర్వహించాల్సి ఉంది. కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో ఈ ఫార్మెటివ్-2 పరీక్షలకు మాత్రమే ఈ విధంగా నిర్వహించేలా ఎస్‌సీఈఆర్టీ ఆదేశించింది. మిగిలిన అన్ని పరీక్షలకు ఇలా ఉండదు.

– శ్రీనివాసరెడ్డి, డీసీఈబీ సెక్రటరీ, నంద్యాల

పకడ్బందీగా చర్యలు తీసుకున్నాం



ఫార్మెటివ్ ఏ-1 పరీక్ష నిర్వహించిన మాదిరిగానే ఫార్మెటివ్ ఏ-2 పరీక్షలను కూడా ఎంఈఓలు, హెచ్ఎంలు, ఉపాధ్యాయులు సమష్టిగా పనిచేసి విజయవంతం చేయాలి. పరీక్షలను పక్కాగా, పారదర్శకంగా సక్రమంగా నిర్వహించాలి. పాఠశాలలు హెచ్ఎంలు ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా నిర్వహించాలి. ఈ ఫార్మెటివ్-2 పరీక్షలను మాత్రం పాత విధానంలోనే నిర్వహిస్తున్నాం. ఈ విషయమై ప్రధానోపాధ్యాయులకు ఇప్పటికే సమాచారం అందించాం. అవగాహన కల్పించాం.

– సుధాకర్‌రెడ్డి, డీఈఓ, నంద్యాల

రైల్వే శాఖలో సహకార ఎన్నికల నగారా

- 12న ఎన్నికలు
- ఏర్పాట్లలో అధికారులు

కర్నూలు(రాజ్‌విహార్): దక్షిణ మధ్య రైల్వేలో ఉద్యోగుల సహకార సొసైటీ ఎన్నికల నిర్వహణకు నగారా మోగింది. ఈ నెల 12న ఎన్నికలు నిర్వహించేందుకు రైల్వే శాఖ అధికారులు చర్యలు చేపట్టారు. హైదరాబాదు డివిజన్‌లోని కర్నూలు బ్రాంచ్‌లో తెలంగాణలోని వనపర్తి రోడ్డు (మదనాపురం) నుంచి కర్నూలు జిల్లాలోని బోగోలు వరకు వస్తుంది. అలాగే గుంటూరు డివిజన్‌లోని నంద్యాల బ్రాంచ్, గుంతకల్లు డివిజన్‌లోని డోన్, ఆదోని బ్రాంచ్‌లలో ఎన్నికలు జరుగనున్నాయి. వీటి పరిధిలో రైల్వే సిగ్నల్, ట్రాక్, మెడికల్, ఎలక్ట్రికల్, సివిల్ తదితర విభాగాలకు చెంది సుమారు 2,500 మందికి పైగా రైల్వే ఉద్యోగులు ఉన్నారు. ఈ ఎన్నికల్లో సౌత్ సెంట్రల్ ఎంప్లాయీస్ సంఘ్, సౌత్ సెంట్రల్ మజ్దూర్ యూనియన్, దక్షిణ మధ్య రైల్వే కార్మిక సంఘం, మజ్దూర్ యూనియన్ సంఘాల సభ్యులు బరిలోకి దిగనున్నారు. దేశ వ్యాప్తంగా జరిగే ఈ ఎన్నికల్లో ప్రధానంగా సౌత్ సెంట్రల్ ఎంప్లాయీస్ సంఘ్, సౌత్ సెంట్రల్ మజ్దూర్ యూనియన్ సభ్యుల మధ్య ప్రధాన పోటీ నెలకొననుంది. ప్రతి రైల్వే స్టేషన్‌లో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయనున్నారు. ఎన్నికలకు కార్మిక సంఘాల ప్రతినిధులు సమాయత్తం అవుతున్నారు. రెండు రోజుల్లో సమావేశాలు నిర్వహించి ఎన్నికల్లో గెలుపు కోసం వ్యూహరచన చేయనున్నట్లు తెలుస్తోంది. రాష్ట్ర నేతలను ఆహ్వానించి సభలు నిర్వహించేందుకు స్థానిక సంఘాల నాయకులు ఏర్పాట్లు చేస్తున్నారు.

క్లుప్తంగా

23న విజయదశమి

● కర్నూలు పండిత సభ ఏకగ్రీవ తీర్మానం




సమావేశంలో పాల్గొన్న పండితులు

కర్నూలు కల్చరల్: దసరా పండుగ అక్టోబర్ 23వ తేదీనే జరుపుకోవాలని కర్నూలు పండిత సభ ఏకగ్రీవ తీర్మానం చేసింది. మంగళవారం వినాయక్ ఘాట్‌లో పండితుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పండితులు వెంకటా చలపతి శర్మ, మనోహర్ శర్మ మాట్లాడుతూ విజయదశమి పండుగను 23 లేదా 24వ తేదీన నిర్వహించాలనే విషయంలో భక్తుల్లో అయోమయం ఉందన్నారు. ఈ మేరకు పండితులందరూ సమావేశమై చర్చించిన అనంతరం అక్టోబర్ 23వ తేదీ సోమవారం రోజున దసరా పండుగను ఆచరించాలన్నారు. సోమవారం మధ్యాహ్నం నుంచి దశమి తిథి ఉండటం, అలాగే శ్రవణా నక్షత్రం సోమవారం నాడే ఉండటంతో 23వ తేదీ సోమవారం నాడే పండుగ జరుపుకుని సాయంత్రం శమీ దర్శనం చేసుకోవాలని ప్రకటించారు. సమావేశంలో సాయినాథ శర్మ, భరద్వాజ శర్మ, కృష్ణమూర్తి, విశ్వనాథ శర్మ, విజయ్ కుమార్ శర్మ, అనంతకృష్ణ, చేపూరి దత్తాత్రేయ శర్మ, ఈశ్వరయ్య, రఘునాథ్, రామసుబ్బయ్య, ప్రదీప్, రాజేష్, కార్తీక్, దివాకర్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ప్రపంచ అంతరిక్ష వారోత్సవాలు

కర్నూలు సిటీ: సతీష్‌ధావన్ స్పేస్ సెంటర్, భారత అంతరిక్ష పరిశోధన సంస్థ ఆధ్వర్యంలోని ప్రధాన కేంద్రాల్లో ఒకటైన స్పేస్ పోర్ట్ ఆఫ్ ఇండియా ఈనెల 4వ తేదీ నుంచి 10వ తేదీ వరకు ప్రపంచ అంతరిక్ష వారోత్సవాలను నిర్వహిస్తోంది. వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు రాత క్విజ్, డ్రాయింగ్, డిజైన్ ఛాలెంజ్, ఎక్స్ టెంపోర్ స్పీచ్ వంటి తదితర పోటీలు నిర్వహించనున్నారు. ఈ వారోత్సవాలు వివిధ ప్రాంతాల్లోని తొమ్మిది వేదికలపై ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా జిల్లాలోని జి.పుల్లారెడ్డి ఇంజనీరింగ్ కాలేజీలో ఈ నెల 6వ తేదీ నుంచి 8వ తేదీ వరకు వారోత్సవాలకు సంబంధించిన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన కార్యక్రమాల్లో ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థలకు చెందిన వారు ఏవరైనా పాల్గొనవచ్చునని ఇస్రో, జి.పుల్లారెడ్డి కాలేజీ యాజమాన్యం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

క్వారీల్లో రక్షణ చర్యలు చేపట్టాలి



క్వారీని తనిఖీ చేస్తున్న డీడీ డైరెక్టర్ రాజశేఖర్

కర్నూలు (న్యూసిటీ): క్వారీల్లో కార్మికుల భద్రతకు రక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్ క్వారీ యజమానులను ఆదేశించారు. ఓర్వకల్లు మండం కాల్వ గ్రామంలోని బరైటీస్ క్వారీని మంగళవారం ఆయన తనిఖీ చేశారు. క్వారీకి సంబంధించిన రికార్డులను పరిశీలించి నిబంధనలు పాటించాలని ఆదేశించారు. అనుమతికి మించి మట్టి తవ్వితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట విజిలెన్స్ అడిషనల్ డైరెక్టర్ బైరాగి నాయుడు, మైనింగ్ సిబ్బంది ఉన్నారు.

పంటకు బీమా..రైతుకు ధీమా

● రైతులకు 2019 నుంచి ఉచితంగా పంటల బీమా అమలు చేస్తున్న ప్రభుత్వం
● తాజాగా 2023-24 సంవత్సరానికి సంబంధించి అమలుకు ఉత్తర్వులు
● కర్నూలు జిల్లాలో 14, నంద్యాల జిల్లాలో 15 పంటలకు బీమా
● రైతుల వాటా ప్రీమియాన్ని ప్రభుత్వమే చెల్లింపు
● నోటిఫై చేసిన పంటలు ఈ-క్రాప్‌లో నమోదైతే చాలు బీమా వర్తించినట్లే



వర్షాధారం కింద సాగు చేసిన పత్తి పంట (వాతావరణ బీమా)ఈ-పంట

కర్నూలు(అగ్రికల్చర్): రాష్ట్ర ప్రభుత్వం ఉచిత పంటల బీమా ద్వారా రైతులకు భరోసా ఇస్తోంది. 2019-20 నుంచి ఎలాంటి అవాంతరం లేకుండా ఈ పథకాన్ని అమలు చేస్తోంది. తాజాగా 2023-24 సంవత్సరానికి సంబంధించి అమలుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. డాక్టర్ వైఎస్ఆర్ ఉచిత పంటల బీమా-ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన(పీఎంఎఫ్‌బీవై), వాతావరణ ఆధారిత బీమా కింద పంటలను నోటిఫై చేస్తూ.. మార్గదర్శకాలు విడుదల చేసింది.

కర్నూలు జిల్లాలో ఖరీఫ్‌లో 9 పంటలకు, రబీలో 5 పంటలకు, నంద్యాల జిల్లాలో ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి 9 పంటలకు, రబీ సీజన్‌లో 6 పంటలకు వైఎస్ఆర్ ఉచిత పంటల బీమా సదుపాయం కల్పించడం విశేషం. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన, వాతావరణ ఆధారిత బీమా కింద రైతు వాటా కింద చెల్లించాల్సిన ప్రీమియాన్ని ప్రభుత్వమే చెల్లిస్తుండటం విశేషం. టీడీపీ ప్రభుత్వ హయాంలో పంటల బీమా అత్యంత ఖరీదుగా ఉండేది. ఆహార పంటలకు 2 శాతం, వాణిజ్య పంటలకు 5 శాతం ప్రీమియం చెల్లించాల్సి ఉండేది. దీంతో గత ప్రభుత్వ హయాంలో సామాన్య, మధ్య తరగతి రైతులు బీమాకు దూరమయ్యారు. 2019లో వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన ఏడాది నుంచి రైతుల సంక్షేమం లక్ష్యంగా ఉచిత పంటల బీమా సదుపాయాన్ని కల్పిస్తోంది. నోటిఫై చేసిన పంటలు ఈ-క్రాప్‌లో నమోదు అయితే చాలు బీమా వర్తించినట్లే. దీంతో రైతుల్లో ఆత్మ విశ్వాసం పెరిగింది. 2023-24 సంవత్సరానికి సంబంధించి ఈ-క్రాప్ బుకింగ్ కూడా దాదాపు పూర్తి అయింది. మరి కొద్ది రోజుల్లోనే ఈ-క్రాఫ్ డేటా సంబంధిత బీమా కంపెనీలకు ఇవ్వడానికి రంగం సిద్ధమవుతోంది.

వాతావరణ ఆధారిత బీమా అమలు ఇలా....

డాక్టర్ వైఎస్సార్ ఉచిత పంటల బీమా- వాతావరణ ఆధారిత బీమా కింద కర్నూలు జిల్లాలో ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఉమ్మడి కర్నూలు జిల్లాలో వర్షాధారం పత్తి, వేరుశనగ, రబీ సీజన్‌లో కర్నూలు జిల్లాలో టమాట, నంద్యాల జిల్లాలో అరటి పంటలు నోటిఫై అయ్యాయి. కర్నూలు జిల్లాలో బజాజ్ అలియాంజ్ ఇన్సూరెన్స్ కంపెనీ, నంద్యాల జిల్లాలో హెచ్‌డీఎఫ్‌సీ-ఈఆర్‌జీఓ బ్యాంకు వాతావరణ ఆధారిత బీమాను అమలు చేస్తుంది. పత్తికి రిస్క్ పీరియడ్ జూలై 1 నుంచి నవంబరు 31 వరకు ఉంటుంది. వేరుశనగకు జూలై 16 నుంచి అక్టోబరు 31 వరకు ఉంటుంది. పత్తికి హెక్టారుకు రూ.90 వేలు, వేరుశనగకు రూ.65 వేలు. టమాటకు రూ.75 వేలు, నంద్యాల జిల్లాలో అరటికి రూ.1,37,500 విలువకు బీమా చేస్తారు. పత్తికి 5 శాతం, వేరుశనగకు 2 శాతం, టమాటకు 4 శాతం, అరటికి 5 శాతం రైతులు ప్రీమియం చెల్లించాల్సి ఉంది. రైతుల వాటా ప్రీమియాన్ని ప్రభుత్వమే చెల్లిస్తుంది.

దిగుబడి ఆధారిత బీమా ఇలా...

డాక్టర్ వైఎస్ఆర్ ఉచిత పంటల భీమా-ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన(పీఎంఎఫ్‌బీవై)ను పంట దిగుబడుల ఆధారంగా అమలు చేస్తారు. దీనినే దిగుబడి ఆధారిత బీమాగా వ్యవహరిస్తారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఈ బీమాను ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్ అమలు చేస్తుంది. కర్నూలు, నంద్యాల జిల్లాల్లో వరికి గ్రామం యూనిట్‌గా బీమా సదుపాయం కల్పించడం విశేషం. కర్నూలు జిల్లాలో ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి మొక్కజొన్న, కంది, ఎండుమిర్చి, జొన్న, ఆముదం, కొర్ర, సజ్జ, ఉల్లి, రబీ సీజన్‌లో శనగ వరి, జొన్న, వేరుశనగ, ఉల్లి పంటలకు ఉచిత పంటల బీమా సదుపాయం లభించింది. నంద్యాల జిల్లాలో వరి, మొక్కజొన్న, కంది, మినుము, ఎండుమిర్చి, జొన్న,సజ్జ, కొర్ర, ఉల్లి, రబీ సీజన్‌లో శనగ, వరి, జొన్న, మినుము, వేరుశనగ, ఉల్లి పంటలకు బీమా సదుపాయం లభించింది. రబీ సీజన్‌లో ఉమ్మడి కర్నూలు జిల్లాలో శనగకు గ్రామం యూనిట్‌గా బీమా సదుపాయం కల్పిస్తున్నారు. పంటకోత ప్రయోగాల్లో వచ్చే దిగుబడులు ఆధారంగా బీమా అమలు చేస్తారు.

నాలుగేళ్లలో బీమా పరిహారం కింద రూ.1046.44 కోట్లు చెల్లింపు

రైతులు ఒక్క రూపాయి కూడా ప్రీమియం చెల్లించకుండా బీమా సదుపాయం పొందుతుంది దేశంలో ఆంధ్రప్రదేశ్‌లో తప్ప ఎక్కడా లేదు. 2014-15 నుంచి 2018-19 వరకు వరుస కరువే. టీడీపీ హయాంలో ప్రీమియం చెల్లించినప్పటికి పరిహారం అందింది నామమాత్రమే. 2019 నుంచి 2022 వరకు వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వం రైతుల నుంచి ఒక్క రూపాయి ప్రీమియం తీసుకోలేదు. వైఎస్ఆర్ ఉచిత పంటల బీమా కింద రూ.1046.44 కోట్లు పరిహారాన్ని చెల్లించింది.

ఉమ్మడి జిల్లాలో ఖరీఫ్‌లో దిగుబడి ఆధారిత బీమా విలువ ఇలా

నోటిఫై అయిన పంట	బీమా చేసే మొత్తం (రూపాయల్లో)	బీమా యూనిట్
వరి	87,500	వీఐయూ
వరి (నంద్యాల)	90,000	వీఐయూ
మొక్కజొన్న	75,000	ఎంఐయూ
కంది	50,000	ఎంఐయూ
ఎండుమిర్చి	2,00,00	ఎంఐయూ
జొన్న	45,000	ఎంఐయూ
ఆముదం	40,000	ఎంఐయూ
మినుము(నంద్యాల)	40,000	ఎంఐయూ
కొర్ర	37,500	డీఐయూ
సజ్జ	35,000	డీఎంయూ
ఉల్లి	1,00,00	డీఎంయూ

ఈ-క్రాప్‌లో నమోదైతే చాలు బీమా వర్తించినట్లే



ప్రభుత్వం 2023-24 సంవత్సరానికి సంబంధించి డాక్టర్ వైఎస్ఆర్ ఉచిత పంటల బీమా సదుపాయం కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. పంటలను కూడా నోటిఫై చేయడంతో పాటు బీమా అమలు చేసే కంపెనీలను కూడా ఎంపిక చేసింది. నోటిఫై చేసిన పంటలు ఈ-క్రాప్‌లో నమోదైతే బీమా అమలులో ఉన్నట్లే. అయితే రైతులు ఈ-కేవైసీ చేయించుకుని పంటలను ధ్రువీకరించుకోవాల్సి ఉంది.

– పీఎల్ వరలక్ష్మి, జిల్లా వ్యవసాయ అధికారి, కర్నూలు

నేడు జిల్లాలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాలు

కర్నూలు(హాస్పిటల్): జిల్లాలో ఈ నెల 4వ తేదీన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాలు జరిగే ప్రాంతాలను మంగళవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ప్రకటించారు.

మండలం	వైద్యశిబిరం ఏర్పాటయ్యే గ్రామం
ఎమ్మిగనూరు	దేవిబెట్ట
వెల్దుర్తి	గోవర్ధనగిరి-2
తుగ్గలి	మారెళ్ల
పెద్దకడుబూరు	కంబాలదిన్నె
పత్తికొండ	నలకలదొడ్డి
ఓర్వకల్	నన్నూరు-2
నందవరం	కనకవీడు-2
మంత్రాలయం	కాచాపురం-2
కర్నూలు	ఇ.తాండ్రపాడు-1
కౌతాళం	రౌడూరు
కోసిగి	కోసిగి-3
కోడుమూరు	కోడుమూరు-3
కల్లూరు	కొంగనపాడు
హాలహర్వి	చింతకుంట్ల-1
గూడూరు	గుడిపాడు
గోనెగండ్ల	ఐరన్‌బండ-ఎ
దేవనకొండ	పి.కోటకొండ-1
సి.బెళగల్	సి.బెళగల్-3
ఆస్పరి	బిల్లేకల్
ఆలూరు	ఆలూరు-3
ఆదోని	దొడ్డనకేరి

మహిళ అదృశ్యం



ఖాజాబీ (ఫైల్)

కర్నూలు : కర్నూలు పాతబస్తీ ఖడక్‌పురలో నివాసముంటున్న ఆరిఫ్ బాషా భార్య ఖాజాబీ (33) అదృశ్యమైంది. గత నెల 25వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. గతంలో కూడా ఇలా రెండుసార్లు వెళ్లి తిరిగి ఇంటికి చేరుకుంది. దీంతో ఈసారి కూడా వస్తుందన్న నమ్మకంతో కుటుంబ సభ్యులు వారం రోజుల పాటు ఎదురుచూశారు. కర్నూలు నగరంతో పాటు చుట్టుముట్టు గ్రామాల్లో గాలించారు. బంధువులు, స్నేహితుల ఇళ్ల వద్ద ఆరా తీసినా కనిపించకపోవడంతో మంగళవారం కుటుంబ సభ్యులు ఒకటో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వారు తెలిపారు.

బావిలో పడి యువకుడి మృతి

కర్నూలు: కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని జొహరాపురానికి చెందిన తెలుగు చిన్నమద్దిలేటి (27) ప్రమాదవశాత్తు బావిలో పడి మృతిచెందాడు. ఈయన గౌండా పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం ఉదయం గ్రామ సమీపంలోని బావిలో నీళ్లు తాగడానికి వెళ్లి ప్రమాదవశాత్తు పడ్డాడు. సమీపంలో ఉన్న యువకులు కొంతమంది అప్రమత్తమై కాపాడే ప్రయత్నం చేశారు. నీటిలో నుంచి బయటకు తీసి కుటుంబ సభ్యుల ద్వారా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షలు జరిపి అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. ఈయన తండ్రి తెలుగు నర్సింహులు కూడా అనారోగ్యంతో 15 రోజుల క్రితమే మృతిచెందాడు. మద్దిలేటి తల్లి తెలుగు అక్కమ్మ ఫిర్యాదు మేరకు ఒకటో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఓపెన్ స్కూల్ టెన్త్, ఇంటర్ అడ్మిషన్ల గడువు పెంపు

కర్నూలు సిటీ: ఏపీ సార్వత్రిక విద్యాపీఠం ద్వారా 2023-24 విద్యా సంవత్సరానికి ఓపెన్ స్కూల్ టెన్త్, ఇంటర్మీడియట్ అడ్మిషన్ల గడువు ఈ నెల 15వ తేదీ వరకు పొడిగించినట్లు డీఈఓ డాక్టర్ వి.రంగారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత, ఆసక్తి ఉండి 14 సంవత్సరాల వయస్సు కలిగిన వారు ఎవరైన 10వ తరగతికి, 15 సంవత్సరాల వయస్సు నిండి టెన్త్ పాసైన వారు ఇంటర్మీడియేట్ చదివేందుకు అర్హులన్నారు. పూర్తి సమాచారం కోసం www. apopenschool. ap. gov. in వెబ్‌సైట్‌ను, లేదా సమీపంలోని స్టడీ సెంటర్‌ను సందర్శించాలన్నారు.

ఇద్దరు దొంగల అరెస్ట్

● 69 గ్రాముల బంగారం రికవరీ

ఎమ్మిగనూరు రూరల్: పట్టణంలోని శ్రీరామ స్వామి దేవాలయం పక్కన బంగారు దుకాణంలో చోరీకి పాల్పడిన ఇద్దరు దొంగలను పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి 69.600 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం సాయంత్రం పట్టణ సీఐ మధుసుదన్‌రావు తెలిపిన వివరాల మేరకు.. పట్టణంలోని రఘువీరాచారి అనే వ్యక్తికి సంబంధించిన బంగారం షాప్‌లో ఈ సంవత్సరం జూన్ 19వ తేదీ ఉదయం గుర్తు తెలియని వ్యక్తులు రూ. 19 లక్షలు విలువ చేసే 500 గ్రాముల బంగారు ఆభరణాలను చోరీ చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టిన పోలీసులు చోరీకి పాల్పడింది కర్ణాటక రాష్ట్రం శివమొగ్గ జిల్లా భద్రావతి టౌన్, హోసమన్ కాలనీకి చెందిన ఉలిగప్ప అలియాస్ విక్రం, భద్రావతి టౌన్ నమ్మా బేకరి, హోసమన్ ఏరియాకు చెందిన కళ్యాణ్‌నాయుడుగా గుర్తించారు. దొంగతనాలనే వృత్తిగా చేసుకున్న ఆ ఇద్దరిని మంగళవారం అరెస్టు చేసి 69.600 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. ఈ కేసులో మరి కొంత మంది ఉన్నారని, వారిని కూడా త్వరలో అరెస్టు చేస్తామన్నారు. చోరీ కేసు ఛేదనలో చాకచక్యంగా వ్యవహరించిన సీఐ మధుసుదన్‌రావు, ఎస్ఐలు మస్తాన్‌వలి, రమేష్ బాబు, పోలీస్ టీంను డీఎస్పీ సీతారామయ్య అభినందించారు.

ఓటింగ్ యంత్రాల ఎఫ్ఎల్‌సీకి ఏర్పాట్లు

● ఎన్నికల ప్రధానాధికారి ముఖేషుకుమార్ మీనాకు వివరించిన కలెక్టర్ సృజన



వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ జి.సృజన

కర్నూలు(సెంట్రల్): ఈనెల 16 నుంచి నవంబర్ 5వ తేదీ వరకు చేపట్టే ఓటింగ్ యంత్రాల ఫస్టు లెవల్ చెక్ (ఎఫ్ఎల్‌సీ) ప్రక్రియ కోసం అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని కలెక్టర్ డాక్టర్ జి.సృజన రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్‌కుమార్ మీనాకు వివరించారు. మంగళవారం ఆయన విజయవాడ నుంచి ఓటరు జాబితా సవరణ అంశాలపై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా ముఖేష్‌కుమార్ మీనాకు జిల్లాలోని ఎఫ్ఎల్‌సీ ప్రక్రియపై ఆమె వివరించారు. జిల్లాకు 7,020 బ్యాలెట్ యూనిట్లు, 5,460 కంట్రోల్ యూనిట్లు వచ్చాయని, వీటిని బెల్ కంపెనీ ప్రతినిధులు, రాజకీయ పార్టీల ప్రతినిధుల ఆధ్వర్యంలో ఎఫ్ఎల్‌సీ ప్రక్రియను చేపట్టేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. జిల్లాలో ఫారం-6 కింద 69 వేల దరఖాస్తులు రాగా, 1064 పెండింగ్‌లో ఉన్నాయని, ఫారం-7 కింద 7,692 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని, ఫారం-8 కింద వచ్చిన దరఖాస్తుల్లో 2,247 పెండింగ్‌లో ఉన్నాయని, వాటన్నింటిపై క్షేత్రస్థాయిలో పూర్తి స్థాయి విచారణ జరిపి తగు చర్యలు తీసుకుంటామని చెప్పారు. రాజకీయ పార్టీలు లేవనెత్తిన అంశాలపై ఎప్పటికప్పుడు తగు పరిష్కారాలు చూపుతున్నట్లు చెప్పారు. కలెక్టరేట్ నుంచి డీఆర్వో కె.మధుసూదనరావు, జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి, ఈఆర్ఓలు రమ, మల్లికార్జునుడు, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ మురళీ పాల్గొన్నారు.

ఓర్వకల్లు పొదుపు మహిళలు దేశానికి ఆదర్శం



ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డితో మణిపూర్ మహిళా బృందం

● మణిపూర్ బృందంతో ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి

ఓర్వకల్లు: పొదుపు సంఘాల ద్వారా ఓర్వకల్లు మహిళలు సాధించిన ఆర్థిక విజయాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయని స్థానిక ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. మణిపూర్ నుంచి శిక్షణ నిమిత్తం మహిళా బృందం ఓర్వకల్లుకు వచ్చింది. మండల మహిళా సమాఖ్య వ్యవస్థాపకురాలు విజయభారతి ఆధ్వర్యంలో వారికి శిక్షణ తరగతులు జరుగుతున్నాయి. ఈ కార్యక్రమానికి అతిథిగా హాజరైన ఎమ్మెల్యే కాటసాని మాట్లాడుతూ పొదుపు సంఘాల అభివృద్ధిలో విజయభారతి సేవలు అభినందనీయమని ప్రశంసించారు. ఆమె సలహాలు, సూచనలు పాటిస్తూ స్థానిక పొదుపు మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నారన్నారు. అంతకుముందు విజయభారతి ఎమ్మెల్యేను మణిపూర్ బృందానికి పరిచయం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ తిప్పన్న, జెడ్పీటీసీ సభ్యుడు రంగనాథ్‌గౌడు, సింగిల్ విండో చైర్మన్ చంద్రశేఖర్ రెడ్డి, స్థానిక నాయకులు శంకర్‌రెడ్డి, మహిళా సమాఖ్య అధ్యక్ష, కార్యదర్శులు విజయలక్ష్మి, తైరున్నిషా, ఏపీఎం వెంకటరామిరెడ్డి, వైఎస్సార్ క్రాంతి పథం సిబ్బంది, పొదుపు మహిళలు పాల్గొన్నారు.

కీచక ఉపాధ్యాయుడికి దేహశుద్ధి



ఉపాధ్యాయుడిని నిలదీస్తున్న తల్లిదండ్రులు

ఓర్వకల్లు: విద్యాబుద్ధులు నేర్పాల్సిన గురువు గాడి తప్పాడు. ఓ విద్యార్థి పట్ల అసభ్యంగా ప్రవర్తించడంతో సదరు బాలుడి తల్లిదండ్రులు దేహశుద్ధి చేశారు. ఈ సంఘటన మంగళవారం మండలంలోని ఉప్పలపాడు గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికులు, విద్యార్థి సంఘాల నాయకులు తెలిపిన వివరాల మేరకు.. స్థానిక ప్రాథమికోన్నత పాఠశాలలో గత నాలుగేళ్లుగా రాంబాబు అనే వ్యక్తి తెలుగు ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న ఓ విద్యార్థితో చనువు పెంచుకున్నాడు. ప్రస్తుతం ఆ విద్యార్థి ఉయ్యాలవాడ హైస్కూల్‌లో 9వ తరగతి చదువుతున్నాడు. అక్కడికి వెళ్లిన కూడా లైగింక వేధింపులకు గురిచేస్తుండటంతో విద్యార్థి భరించలేక తల్లిదండ్రులకు తెలియచేశాడు. దీంతో కోపోద్రిక్తులైన తల్లిదండ్రులు పాఠశాల వద్దకు వెళ్లి ఉపాధ్యాయుడిని నిలదీశారు. తప్పు ఒప్పుకోకపోవడంతో దేహశుద్ధి చేశారు. గ్రామస్తులు సదరు ఉపాధ్యాయుడిని పోలీసుస్టేషన్‌కు తరలించారు. ఈ ఘటనపై పోలీసులు విచారణ చేపట్టారు.

ఉపాధి హామీ కార్యాలయంలో చోరీ



ఆలూరు ఉపాధి కార్యాలయంలో వివరాలు సేకరిస్తున్న పోలీసులు

ఆలూరు రూరల్: మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కార్యాలయంలో చోరీ జరిగింది. బీరువా తాళాలు పగులగొట్టి దొంగలు డిజిటల్ కీలు, సెల్‌ఫోన్ ఎత్తుకెళ్లారు. ఎంపీడీఓ, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఆలూరులోని ఎంపీడీఓ కార్యాలయ పాత భవనంలో ఉపాధిహామీ కార్యాలయం నిర్వహిస్తున్నారు. సోమవారం రాత్రి కార్యాలయం గోడకు దొంగలు రంధ్రం వేసి లోపలికి చొరబడ్డారు. కంప్యూటర్ రూంలో ఉన్న ఏపీఓ, ఎంపీడీఓ డిజిటల్ కీలు, ఏపీఓ సెల్‌ఫోన్ ఎత్తుకెళ్లారు. మంగళవారం ఉదయం అటెండర్ కార్యాలయ తాళాలు తెరిచి చూడగా బీరువా పగులుగొట్టి ఉంది. వెంటనే అటెండర్ ఎంపీడీఓ అల్లబకష్, ఏపీఓ హేమసుందర్‌కు సమాచారం ఇవ్వడంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఏఎస్ఐ తిరుపాల్ నాయక్ చోరీ ప్రదేశాన్ని పరిశీలించారు.కార్యాలయంలో విలువైన పరికరాలు ఉండగా డిజిటల్ కీ మాత్రమే ఎత్తుకెళ్లడంతో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఉపాధి హామీ పథకంలో రోజు వారి కూ లీలకు నగదు చెల్లించడానికి, ఈ శాఖ ద్వారా చేపట్టి న పనులకు బిల్లులు మంజూరు, ఉద్యోగుల జీతా లు చెల్లింపు తదితర వాటికి డిజిటల్ కీ అవసరం.

వీడిన వలంటీర్ హత్య కేసు మిస్టరీ

● భార్యను వేధించాడని హత్య
● ఇద్దరు నిందితుల అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శివనారాయణస్వామి

ఆదోనిఅర్బన్: గతనెలలో పట్టణంలో జరిగిన వలంటీర్ హరిబాబు హత్య కేసును ఆదోని టూటౌన్ పోలీసులు ఛేదించారు. సీసీ ఫుటేజీ ఆధారంగా నిందితులను గుర్తించి అరెస్టు చేశారు. మంగళవారం డీఎస్పీ శివనారాయణ స్వామి విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. పట్టణంలోని రాజీవ్‌గాంధీ నగర్‌లో నివాసముంటున్న ఈరమ్మ కుమారుడు హరిబాబు భరత్‌నగర్ సచివాలయంలో వలంటీర్‌గా పనిచేస్తున్నాడు. అదే కాలనీలో ఉన్న భీమన్న భార్యను మృతుడు వేధించేవాడు. మహిళ కుటుంబసభ్యులు పలుమార్లు హెచ్చరించినా తీరు మార్చుకోకపోగా గణపతి వేడుకల్లో కూడా ఆమెను వేధించాడు. గమనించిన భర్త భీమన్న హత్యకు పథకం రచించాడు. గత నెల 20వ తేదీ అర్ధరాత్రి హరిబాబును మాయమాటలు చెప్పి బహిర్భూమికి తీసుకెళ్లి గొడ్డలితో నరికి చంపేశాడు. అదే రోజు రాత్రి ఇంటికి వెళ్లి తండ్రి ఈరన్నకు విషయం చెప్పాడు. ఆయన సలహా మేరకు ఆధారాలు దొరకకుండా హత్య సమయంలో వేసుకున్న దుస్తులను కాల్చివేశాడు. 21వ తేదీ ఉదయం కుమారుడి హత్య విషయం తెలుసుకున్న తల్లి ఈరమ్మ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు హతుడి ఫోన్ కాల్స్, సీసీ ఫుటేజీ ఆధారంగా హంతకులను గుర్తించి గాలింపు చర్యలు చేపట్టారు. విషయం తెలుసుకున్న భీమన్న, అతని తండ్రి ఈరన్న మండిగిరి వీఆర్వో రాజశేఖర్ ముందు లొంగిపోయారు. వారు హత్యకు వినియోగించిన గొడ్డలిని స్వాధీనం చేసుకుని అరెస్టు చేసినట్లు డీఎస్పీ వెల్లడించారు. కేసు ఛేదించిన టూటౌన్ సీఐ శ్రీనివాసనాయక్, వన్‌టౌన్ సీఐ విక్రమసింహ, హెడ్‌కానిస్టేబుల్ సుదర్శన్, కానిస్టేబుల్ ఆంజనేయులు, హోంగార్డు గోవర్ధన్‌ను ఈ సందర్భంగా డీఎస్పీ అభినందించారు.

ముగ్గురు విద్యుత్ ఉద్యోగుల సస్పెన్షన్

నంద్యాల(అర్బన్): ముగ్గురు విద్యుత్ ఉద్యోగులపై సస్పెన్షన్ వేటు పడింది. విద్యుత్ ఉద్యోగులు, పెన్షనర్లకు మంజూరైన వేతనాల్లో వచ్చిన తేడాలకు గాను డివిజన్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న ఏఈ కంబగిరి, జేఏఓ గీతావాణి, ఎల్‌డీసీ ఉషాను సస్పెండ్ చేస్తూ మంగళవారం రాత్రి ఎస్ఈ ఉమాపతి ఉత్తర్వులు జారీ చేశారు. 01-04-2022 నుంచి 31-08-2023 వరకు ఉద్యోగులు, పెన్షనర్లకు జీతాలు మంజూరయ్యాయి. ఉద్యోగుల వేతనాల్లో ఎలాంటి తేడాలు లేకపోగా పెన్షనర్లకు వయస్సుల వారీగా ఇచ్చే వేతనాల్లో అవకతవకలు జరిగాయి. దీనిపై పెన్షనర్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో మంగళవారం విచారణ జరిపి ఆ ముగ్గురిపై ఎస్ఈ సస్పెన్షన్ వేటు వేసినట్లు డీఈ రమణారెడ్డి వెల్లడించారు.